సాక్షి మహబూబాబాద్

శనివారం | 15 | జూన్ | 2024



ప్రతీ సోమవారం ప్రజావాణి

విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువ య్యేందుకు టీజీ ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమ వారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించను న్నట్లు సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



ప్లాగరిజం సాఫ్ట్‌వేర్ నిలిపివేత

కేయూలో ప్లాగరిజం చెక్ చేసే సాఫ్ట్‌వేర్ నిలిచిపోయింది. దీంతో రీసెర్చ్‌స్కాలర్స్ వారి పీహెచ్‌డీ థీసిస్ సబ్మిట్ చేసే అవకాశం లేకుండా పోయింది. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటింటా సర్వే చేయాలి



మరిపెడ: ఆశకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటా సర్వే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య సిబ్బందికి బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా ఆగస్టు నెల నుంచి 18సంవత్సరాలు పైబడిన వారికి మూడు నెలల పాటు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి, ప్రసాద్, వనకర్‌రెడ్డి, శాంతకుమారి, సుదర్శన్, వెంకటేశ్వర్లు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన



కురవి: సీరోలు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి డీఎంహెచ్‌ఓ కళావతిబాయి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఉప కేంద్రం భవన నిర్మాణాలకు గ్రామంలో పలు స్థలాలను పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష, డీపీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, కురవి పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత, సీరోలు తహసీల్దార్ శారద, సీరోలు ఏఏఎం డాక్టర్ సురేందర్, ఏఎన్‌ఎం శ్రీలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ వి.వెంకటరెడ్డిని కలిశారు.

కిరాణావ్యాపారి ఐపీ దాఖలు..?

బయ్యారం: మండల కేంద్రానికి చెందిన కిరాణావ్యాపారి కైరంకొండ గణేష్ ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. వివిధ వర్గాల ద్వారా భారీ మొత్తంలో అప్పులు చేసిన గణేష్ ఇటీవల కుటుంబంతో సహా దైవ దర్శనానికి వెళ్తున్నట్లు స్థానికులకు తెలిపి ఇంటినుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఆచూకీ లేకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు మోసపోయామని గణేష్ కోసం వెతికినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఐపీ దాఖలు చేస్తున్నట్లు శుక్రవారం తన న్యాయవాది ద్వారా సమాచారం గణేష్ పంపడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



బయ్యారం: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏఓ అభిమన్యుడు డీలర్లను హెచ్చరించారు. మండలంలోని బయ్యారం, గంధంపల్లి–కొత్తపేట, రామచంద్రాపురం గ్రామాల్లోని పలు విత్తన, ఎరువుల షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో నిల్వ ఉన్న విత్తనాలతో పాటు స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు విక్రయించిన ప్పుడు తప్పనిసరిగా ఈపాస్ యంత్రాల్లో నమోదు చేయాలన్నారు. డీలర్లు వ్యవసాయ శాఖ సూచించిన ప్రకారం అన్ని రకాల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఏఓ రాంజీ, ఏఈఓలు పూజిత, అఖిల్‌కుమార్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా కృష్ణారెడ్డి నియామకం



చిన్నగూడూరు: ఆయిల్ పామ్ తెలంగాణ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన వల్లూరి కృష్ణారెడ్డి శుక్రవారం నియామకమయ్యారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడి తెరిస్తేనే.. పోస్టులు

- జిల్లా వ్యాప్తంగా 144స్కూళ్ల మూత
- ఆయా పాఠశాలల్లోని 130మంది ఉపాధ్యాయుల డిప్యుటేషన్
- బదిలీల్లోపు రీఓపెన్ అయితేనే పోస్టులు ఉండేది..
- లేకుంటే గల్లంతు అయ్యే అవకాశం



మూసివేసిన మహబూబాబాద్ మండలంలోని హజారియాతండాలోని ప్రభుత్వ పాఠశాల

సాక్షి, మహబూబాబాద్: 'రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను తెరుస్తాం.. ఒక్క పాఠశాల కూడా మూసి వేయడానికి వీలులేదు' అని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అనడంతో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వస్తుందని భావించారు. కాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ మూతపడిన బడులు తెరిచేందుకు ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. ఉపాధ్యాయులు కూడా ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టలేదు. అయితే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరుగుతున్న నేపథ్యంలో మూతబడులను తెరిస్తేనే.. అక్కడి ఉపాధ్యాయ పోస్టు నిలుస్తుంది. లేకపోతే బడి ఉన్నా.. పోస్టు గల్లంతు అయ్యే అవకాశం ఉంది.

144 పాఠశాలలు మూత..

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని జిల్లాలోని 144 పాఠశాలలు మూసి వేశారు. గత ఏడాది 142 బడులు మూసి ఉండగా అందులో కొన్నింటిని అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, తండాపెద్దలు, ఇతర వివిధ సామాజిక సంఘాల చొరవతో తెరిచారు. కానీ ఈ ఏడాది మళ్లీ మొదటికి వచ్చింది. విద్యార్థులు లేని పాఠశాలలు 144ఉన్నాయని విద్యాశాఖ అధికారులు తేల్చి చెప్పారు. కాగా ఆదివాసీ, గిరిజనులు ఎక్కువగా ఉన్న మరిపెడ, కేసముద్రం, చిన్నగూడూరు, గూడూరు మండలాల్లో ఎక్కువగా స్కూళ్లు మూతపడ్డాయి. తండాలు, ఆదివాసీ గూడేల్లో ఉన్న ఈ పాఠశాలలను మూసివేయడంతో అక్కడి విద్యార్థులు అడవి, పొలంగట్లు దాటుకుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధించకపోవడం, ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే తల్లిదండ్రులు పిల్లలను పంపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఉచిత దుస్తులు, భోజనం, మంచి సౌకర్యాలు కల్పిస్తున్నా.. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడంతోనే పిల్లలను పంపించడం లేదు. కాగా అధికారులు చొరవతీసుకొని మూసివేసిన బడులను తెరపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

బడి తెరిస్తేనే...

మూతపడిన ప్రభుత్వ పాఠశాలలు తెరిస్తేనే జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు యథావిధిగా ఉంటాయని, లేకపోతే పోస్టులు రద్దు అయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 18మండలాల పరిధిలో 898 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో అన్ని కేటగిరీలు కలిపి 3,681 మంది ఉపాధ్యాయ మంజూరు పోస్టులు ఉన్నాయి. కాగా 144 పాఠశాలలు విద్యార్థులు లేరని మూసివేశారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను వేరే చోటికి డిప్యుటేషన్ వేశారు. విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో 3,084 మంది పనిచేస్తున్నారు. అదేవిధంగా అన్ని కేటగిరీలు కలిపి 597 ఖాళీలు ఉన్నాయి. వీటితోపాటు విద్యార్థులు లేరని మూసివేసిన పాఠశాలలు తెరిస్తే మరో 156 ఎస్జీటీ పోస్టులు అవసరం ఉంటుంది. లేకపోతే జిల్లాలోని సర్‌ప్లస్ పోస్టులను చూపించి పోస్టులు తగ్గించే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు కావాలని బీఈడీ, డీఈడీలు పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించిన 15వేల మంది ఆశలపై నీళ్లు చల్లినట్లు అవుతుంది. కాగా మూసివేసిన పాఠశాలలను తెరిస్తే ఇప్పుడు కాకపోయినా.. తర్వాత డీఎస్సీలోనైనా ఈ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంటుంది.

పాఠశాలలు తెరవాలి



పేద విద్యార్థులు చదివే పాఠశాలలు మూసి వేస్తున్నారు. తండాలు, ఆదివాసీ గూడేల్లో పాఠశాలల భవనాలు ఉన్నాయి. బోధన చేసే ఉపాధ్యాయులు ఉన్నారు. కానీ విద్యార్థులు లేరనే నెపంతో ఉపాధ్యాయులను వేరే చోటుకు డిప్యుటేషన్ వేస్తున్నారు. ప్రజల్లో నమ్మకం కలిగించి, కనీసం నాల్గో తరగతి వరకైనా స్థానికంగా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- మైస శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయ పోస్టులకు ప్రమాదం



మూసి వసిన పాఠశాలలను తెరిపించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. మారుమూల జిల్లాలో ప్రభుత్వ విద్యనే నమ్ముకొని ఉన్నవారు ఎక్కువగా ఉంటారు. పిల్లలు లేరని పాఠశాలలు మూసివేస్తే రేపు పోస్టులు రద్దు అవుతాయి. నిరుద్యోగ యువతీ, యువకులకు అన్యాయం జరుగుతుంది. పాఠశాలలను తెరిపించేందుకు ప్రయత్నాలు చేయాలి.

-సంకా బద్రినారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

పిల్లలు వస్తే తెరుస్తాం..



పిల్లలు లేకుండా ఉపాధ్యాయులు ఖాళీగా ఉండలేరు. పిల్లలు వస్తే మూతపడిన పాఠశాలలు తెరిచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ విషయంపై ఇప్పటికే ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. తల్లిదండ్రులు కోరితే ఇంగ్లిష్ మీడియం పెట్టేందుకు మాకు అభ్యంతరం లేదు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపండి.

-రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రోపియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. భ్రూణ హత్యలు నివారించి, బాలికల నిష్పత్తి పెరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సంక్షేమశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సంబంధిత అధికారులు విజయవంతం చేయాలన్నారు. 20న మాత్రలు వేయని చిన్నారులకు ఈ నెల 27న వేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ కళావతి బాయి మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం టాబ్లెట్, 2నుంచి 19 సంవత్సరాలలోపు వారికి పూర్తి మాత్ర చేయాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

విత్తన పండుగ..

మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ పరిధి, కేసముద్రం మండలం తాళ్ల పూసపల్లి సమీపంలో పత్తి గింజలు విత్తుతున్న రైతులు





చెలకల్లో ఎటు చూసినా రైతులే కనిపించారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తి విత్తనాలు విత్తారు. మరికొంతమంది రైతులు అచ్చు తోలుతూ కనిపించారు.

- సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

సర్టిఫికెట్ల పరిశీలన

గూడూరు: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రజిత సర్టిఫికెట్లను జీసీడీఓ విజయకుమారి శుక్రవారం పరిశీలించారు. కాగా పీఈటీ రజిత సర్టిఫికెట్లు నకిలీవని వచ్చిన ఫిర్యాదు మేరకు డీఈఓ ఆదేశాల మేరకు సర్టిఫికెట్లు పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

మహబూబాబాద్: ధరణి పెండింగ్, ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నవీన్‌మిట్టల్ ధరణి పెండిగ్ దరఖాస్తులు, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలన్నారు. రోజు వారీగా కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్, అదనపు కలెక్టర్ డేవిడ్

అర్హత లేని వైద్యుల పరార్

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని అనుమతి లేని ప్రథమ చికిత్స కేంద్రాలపై డిప్యూటీ డీఎంహెచ్‌ఎం మురళీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో అర్హతలేని వైద్యులు పరారయ్యారు. తనిఖీల అనంతరం మురళీధర్ మాట్లాడుతూ.. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో అర్హత లేనివారు, రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద డాక్టర్లు వస్తారని బోర్డులపై రాయడం, రోగులకు ఇచ్చే ప్రిస్క్రిప్షన్‌లో పేరు ముందు డాక్టర్ అని రాయడం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2010ప్రకారం నేరమని, అందుకు జరిమానాతో పాటు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అదే విధంగా అవసరం లేకున్నా రక్త పరీక్షలు, మూత్రపరీక్షలు చేయడం, రోగులను భయభ్రాంతులకు గురిచేసి అందినకాడిన దండుకునేవారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పరారైన వారిపై నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా ఉప మాస్‌మీడియా అధికారి ప్రసాద్, మహేందర్‌రెడ్డి, వనాకర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మరిపెడలో తనిఖీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డిపో ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారానికి పోరాడుతామని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్న చరిత్ర ఆర్టీసీ కార్మికులదేనన్నారు. ఆ ఉద్యమంలో ఎంతో మంది మరణించారని, ఆన్‌డ్యూటీలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు పక్షాన ఏఐటీయూసీ పోరాటాలకు సిద్ధంగా ఉందని, ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్, ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి రఫిక్‌పాషా, నర్సయ్య, సారయ్య, రావు, పూల్‌సింగ్, మగ్దూం మియా, జమీల్, మాధవరావు, ఎస్‌ఎన్‌రావు, వెంకటేశ్వర్లు, నర్ర శ్రవణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న విజయసారథిరెడ్డి

బడి బస్.. ఫిట్‌లెస్!

25శాతం బస్సులు సామర్థ్య పరీక్షలకు దూరం

- పాఠశాలలు పునఃప్రారంభమైనా స్పందన అంతంతే
- నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు
- పిల్లల ప్రాణాలంటే లెక్కలేని వైనం
- నామమాత్రంగానే ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్

ఖిలా వరంగల్: నూతన విద్యా సంవత్సరం ఈనెల 12న నుంచి ప్రారంభమైంది. కళాశాలలు, పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులను తరలించేందుకు స్కూల్ బస్సులు రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. వీటికి తప్పకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాల్సిందే. వాస్తవానికి పాఠశాలలు పునఃప్రారంభమయ్యేనాటికి పిల్లలను తీసుకెళ్లే వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలి. ఇందుకోసం రవాణా శాఖ అధికారులు వాహనాల సామర్థ్య పరీక్షల గడువు మే 15 వరకు ఇచ్చారు. ఒక వైపు విద్యాసంస్థలు ప్రారంభమైనా ఇంకా ఉమ్మడి జిల్లాలో 25శాతానికి పైగా బస్సులకు ఫిట్‌నెస్ కావాల్సి ఉంది. 10 బస్సులు ఉన్న విద్యాసంస్థలో 6 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ చేయించి మిగిలిన వాటికి ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డు ఎక్కిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో మొత్తం స్కూల్ బస్సులు 1,755 ఉన్నాయి. అందులో ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందినవి 1,182 మాత్రమే. మిగిలిన 573బస్సుల్లో త్వరగా పూర్తి చేసుకోవాలి సూచిస్తున్నారు. కాల పరిమితి పూర్తి చేసుకున్న, వివిధ కారణాల వల్ల 225 బస్సులను అధికారులు ఫిట్‌నెస్ చేయకుండా తిరస్కరించారు. ఇంకా మిగిలిన 348 బస్సులకు ఆన్‌లైన్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉందని డీటీసీ చెబుతున్నారు.

తూతూ మంత్రంగా పరీక్షలు..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను సంబంధిత అధికారులు తూతూ మంత్రంగానే నిర్వహిస్తున్నారు. కనీసం పది నిమిషాలైనా చెక్ చేయకుండానే బస్సులను పంపించేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం అధికారులు అప్రమత్తమవుతారు. ప్రమాదాలు జరగకుండా ముందుగానే బస్సుల తనిఖీ చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీఏ అధికారుల ఏం చేయాలి..?

పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి బస్సు ఫిట్‌నెస్ పకడ్బందీగా చూడాలి. నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలి. చాలా పాఠశాలలకు ఎక్కువ సంఖ్యలో బస్సుల ఉంటాయి. ఒకటి రెండు బస్సులను చూసే ఫిట్‌నెస్ అయిందని మమ అనిపించకుండా ప్రతి బస్సును చెక్ చేయాలి. నెల, రెండు నెలలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బస్సుల పరిస్థితి డ్రైవర్ల పరిస్థితి చెక్ చేస్తుండాలి. ఏమైనా లోపాలు ఉంటే ఒత్తిళ్లకు లొంగకుండా బస్సును సీజ్ చేయాలి.

వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు 8 స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటి ద్వారానే విద్యార్థులను తీసుకువస్తారు. పాఠశాల పునఃప్రారంభంనాటికి అన్నింటికీ ఫిట్‌నెస్ చేయించాలి. కానీ అందులో ఐదు బస్సులకు చేయించారు. మిగతా బస్సులకు చేయించకుండానే రోడ్డెక్కించారు. ఆ బస్సులు పాతవి కావడంతో ఫిట్‌నెస్‌కు వెళ్తే తిరస్కరించే అవకాశం ఉందని సదరు యాజమాన్యం ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

ఈ ఒక్క పాఠశాలనే కాదు.. నాలుగైదు బస్సులు, మినీ వ్యాన్‌లు ఉన్న పాఠశాలల ఇదే పంథాను ఎంచుకున్నాయి. నిపుణులైన డ్రైవర్లను పెట్టుకుంటే జీతాలు ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందని, ప్రతి సంవత్సరం కొత్తవారిని తీసుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి.



ఆర్టీఏకు ఫిట్‌నెస్‌కు వచ్చిన స్కూల్ బస్సు

విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం



ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సకాలంలో బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. పాఠశాలల పునఃప్రారంభం నుంచే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాం. ఫిట్‌నెస్‌లేని బస్సులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. యాజమాన్యాలు నిర్లక్ష్యాన్ని వీడి ఫిట్‌నెస్‌లు చేయించుకోవాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలి. పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- పుప్పాల శ్రీనివాస్, డీటీసీ హనుమకొండ

ఉమ్మడి జిల్లాలో స్కూల్ బస్సుల వివరాలు

జిల్లా	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ చేసుకున్నవి	చేయించు కోవాల్సినవి
వరంగల్	352	252	100
హనుమకొండ	920	621	299
జనగామ	103	76	27
భూపాలపల్లి	130	89	41
ములుగు	95	50	45
మహబూబాబాద్	155	94	61
మొత్తం	1,755	1,182	573

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

నెహ్రూసెంటర్: విద్యుత్‌శాఖ మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఈ జె.నరేష్ శుక్రవారం తెలిపారు. భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం, ఇళ్లల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వినియోగించడం, రైతులు మోటార్ల వద్ద భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల తరచూగా విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగుల భద్రతపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని, ఎప్పటికప్పుడూ భద్రత పరికరాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, సినిమా థియేటర్లు, జంక్షన్లు, పాఠశాలలు, వివిధ ప్రదేశాల్లో విద్యుత భద్రత అవగాహన సదస్సులు, నివారణ సూచనలు, జాగ్రత్తలు తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేయాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

బాంబు పేలుడులో గాయపడిన మహిళ కాలు తొలగింపు


ఆస్పత్రిలో ఉన్న సునీత

వెంకటాపురం(కె) : కర్రిగుట్టల సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌ బాంబు పేలిన ఘటనలో గాయపడిన సునీతను గురువారం రాత్రి భద్రాచలంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె మోకాలి కింది భాగం పూర్తిగా నుజ్జునుజ్జయినందున ఆపరేషన్‌ చేసి తొలగించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్‌ రూరల్‌ : మామ, మరిది వేధింపులు తాళలేక గడ్డి మందుతాగి ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్‌ మండలంలోని లక్ష్మీపురం తండా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్‌ ఎస్సై దీపికారెడ్డి శుక్రవారం రాత్రి కేసు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్‌ మండలంలోని లక్ష్మీపురం తండా గ్రామానికి చెందిన సపావట్‌ లావణ్య–సురేశ్‌ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. 8 ఏళ్ల క్రితం సురేశ్‌ మృతిచెందాడు. ఈక్రమంలో కొంతకాలంగా మరిది సపావట్‌ వేణు ఆమెను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. అంతేకాకుండా కొద్ది రోజుల క్రితం వేణు ఇంటికి లావణ్య ఇంటికి మధ్యలో కట్టెలు వేయగా మామ సపావట్‌ వెంకన్న అసభ్య పదజాలంతో దూషించాడు. మామ, మరిది కలిసి ఆమెపై దాడికి యత్నించారు. ఈ విషయమై ఎంపీపీ భూక్య మౌనిక తన ఆడపడుచు లావణ్యను ఎందుకు అలా తిడుతున్నారని వెంకన్న, వేణును ప్రశ్నించింది. వారిద్దరూ ఎంపీపీ మౌనికతోపాటు లావణ్యను ఇష్టారీతిన దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన లావణ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరిమృతి


పులి రవి (ఫైల్‌)

రేగొండ: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రంగయ్యపల్లి శివారులో శుక్రవారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్‌ జిల్లా నల్లబెల్లి మండలం ముచింపుల గ్రామానికి చెందిన పులి రవి (63) గోదావరిఖనికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా రంగయ్యపల్లి మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రవికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్‌ తెలిపారు.

ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ నిలిపివేత

- కేయూ పరిశోధకుల పీహెచ్‌డీ థీసిస్‌ సబ్‌మిషన్‌కు ఆటంకం
- నిరీక్షిస్తున్న పరిశోధకులు



కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో వివిధ విభాగాలకు చెందిన రిసెర్చ్‌ స్కాలర్స్‌ (పీహెచ్‌డీ) పరిశోధన అనంతరం థీసిస్‌ కాన్ఫిడెన్షియల్‌ విభాగంలో సబ్‌మిట్‌ చేసే ముందు తమ పరిశోధన గ్రంథాన్ని యాంటి ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌లో చెక్‌ చేయించాల్సి ఉంటుంది. ఇందులో 'సిమిలారిటీ' 10శాతంకంటే ఎక్కువగా ఉన్నట్లు తేలితే సబ్‌మిషన్‌ చేసేందుకు అవకాశం ఉండదు. అయితే వారం రోజుల క్రితం కేయూలో ప్లాగరిజం చెక్‌చేసే సాఫ్ట్‌వేర్‌ను సంబంధిత సంబంధిత సంస్థ నిలిపివేసింది. దీంతో తమ పరిశోధన పూర్తి చేసుకున్న రీసెర్చ్‌స్కాలర్స్‌ పీహెచ్‌డీ థీసిస్‌ సబ్‌మిట్‌ చేసే అవకాశం లేకుండా పోయింది.

కేయూలో 2017నుంచి ప్లాగరిజం అమలు

పీహెచ్‌డీ పరిశోధన చేసే సమయంలో రిసెర్చ్‌ స్కాలర్లు ఇతర గ్రంథాల నుంచి కాపీ కొట్టి తమ పరిశోధనలో పొందుపరుస్తున్నారనే విమర్శలు ఉండేవి. ఈనేపథ్యంలో గ్రంథ చౌర్యాన్ని నియంత్రించేందుకు యూనివర్సిటీలు ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చాయి. కేయూలో 2017–18 సంవత్సరంలో యాంటి ప్లాగరిజం సెల్‌ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ సెల్‌కు డాక్టర్‌ రాజ్‌కుమార్‌ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ లింక్‌ ఉచితం

భారత ప్రభుత్వ యూజీసీ ఎంహెచ్‌ఆర్‌డీ పరిధిలోనే ఇన్‌ఫ్లిబినెట్‌ అనే సంస్థ డ్రిల్‌బిట్‌ ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ చెక్‌చేసే సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగానే వివిధ యూనివర్సిటీలకు ఇచ్చింది. ఇందులో భాగంగా కాకతీయ యూనివర్సిటీకి కూడా ఆ సాఫ్ట్‌వేర్‌ లింక్‌ను ఉచితంగా అందజేస్తుంది. అందుకు సంబంధించిన పాస్‌వర్డ్‌ యాంటి ప్లాగరిజం సెల్‌ కోఆర్డినేటర్‌తోపాటు, యూనివర్సిటీలో అన్ని విభాగాల అధిపతులకు అందజేశారు. ఎందుకంటే వివిధ విభాగాల పరిశోధకులు తమ గ్రంథాలను చాప్టర్ల ప్రకారం.. చెక్‌ చేసుకునే వీలుంటుందని అభిప్రాయం. అయితే ఇలా అన్ని విభాగాలవారు ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడంతో ఎక్కువ భారం పడి సర్వర్‌ ఇబ్బందికరంగా మారింది. దీంతో సంబంధిత సంస్థ ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ చెకింగ్‌ లింక్‌ను కేయూకు తాత్కాలికంగా నిలిపివేసిందని పలువురి అభిప్రాయం. ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ నిలిపివేతపై విభాగాల అధిపతులు, సూపర్‌వైజర్లకు ఇన్‌ఫ్లిబినెట్‌ సంస్థ డ్రిల్‌బిట్‌ ఎక్స్‌ట్రీమ్‌ మెసేజ్‌ ద్వారా తెలియజేసినట్లు సమాచారం.

సాఫ్ట్‌వేర్‌ నిలిపివేత వాస్తవమే..



వివిధ యూనివర్సిటీలతోపాటుగా కేయూకు కూడా సంబంధిత ఇన్‌ఫ్లిబినెట్‌ సంస్థ డ్రిల్‌ బిట్‌ ప్లాగరిజం చెకింగ్‌ సాఫ్ట్‌వేర్‌ లింకును తాత్కాలికంగా నిలిపివేసింది. నేను ఆసంస్థ సైంటిస్టులతో మాట్లాడాను. ఇక నుంచి కేవలం పీహెచ్‌డీ థీసెస్‌లకు సంబంధించిన వాటినే ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌లో చెక్‌ చేసేందుకు అప్‌ లోడు చేస్తామని ఇతర వ్యాసాలను అప్‌లోడు చేయబోమని హామీ ఇస్తూ ఇన్‌ఫ్లిబినెట్‌ సంస్థకు లేఖను మెయిల్‌ చేశా. ఎప్పటిలోగా సాఫ్ట్‌వేర్‌ లింక్‌ ఇస్తారనేది వేచి చూడాల్సిందే.

– రాజ్‌కుమార్‌, కేయూ యాంటి ప్లాగరిజం సెల్‌ కో ఆర్డినేటర్‌

సాఫ్ట్‌వేర్‌ కొనుగోలుకు రూ.లక్షల్లో వ్యయం!

కాకతీయ యూనివర్సిటీకి ఇన్‌ఫ్లిబినెట్‌ సంస్థ ఉచితంగా అందించే డ్రిల్‌శిట్‌ ప్లాగరిజం సాఫ్ట్‌వేర్‌ను నిలిపివేసిన నేపథ్యంలో సొంతంగా ఈ సాఫ్ట్‌వేర్లు కొనుగోలు చేసుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు తప్పదని అంచనా.. కావున ఆ సంస్థ మళ్లీ సాఫ్ట్‌వేర్‌ను అందించేలా కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీరో విద్యుత్‌ ప్రమాదాలే లక్ష్యం

హన్మకొండ: టీజీఎస్పీడీసీఎల్‌లో జీరో విద్యుత్‌ ప్రమాదాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు హనుమకొండ సర్కిల్‌ ఎస్‌ఈ వెంకటనారాయణ, వరంగల్‌ ఎస్‌ఈ మధుసూదన్‌రావు తెలిపారు. ప్రధానంగా భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాల్లో నాణ్యమైన వైరింగ్‌ లేకపోవడం, నాసిరకం విద్యుత్‌ పరికరాలు వాడడం, రైతులు స్విచ్‌ బోర్డు /మోటార్‌ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్‌) పాటించకపోవడం వంటి కారణాల వల్ల విద్యుత్‌ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని వారు వేర్వేరు ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌ ఉద్యోగులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కంపెనీ ఉద్యోగులు విద్యుత్‌ ప్రమాదాల భారిన పడకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేయడంతోపాటు, అవసరమైన భద్రతా పరికరాలు అందించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌ ప్రమాదాలను నివారించడానికి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సెక్షన్‌ ఇన్‌చార్జ్‌ ప్రతిరోజూ 15నిమిషాలు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలని సూచించారు. అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్‌ క్లియర్‌ ఇవ్వాలని, ఫోన్‌ ద్వారా లైన్‌ క్లియర్లను ఇవ్వడాన్ని నివారించాలని సూచించారు. విధుల్లో ఉన్న సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్లు విధిగా బ్రేక్‌ డౌన్‌ వర్క్‌ లొకేషన్‌లో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా సెక్షన్‌ అధికారి చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లలో పనులు చేసే ముందు చేతి తొడుగులు ధరించాలని తెలిపారు. ఎర్త్‌ డిశ్చార్జ్‌ రాడ్‌, ఓల్టేజీ డిటెక్టర్‌ ద్వారా లైన్‌లో విద్యుత్‌ సరఫరా జరుగుతుందో లేదో నిర్ధారించుకున్న తర్వాతనే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. డివిజన్‌ ఇంజనీర్‌, ఏడీఈలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరీక్షించాలని తెలిపారు. సెక్షన్‌ ఆఫీసర్‌, సబ్‌ డివిజన్‌ ఆఫీసర్‌ వద్ద బ్రేక్‌ డౌన్ల సమాచారం, క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది పేర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్‌ కార్యాలయాలు, బస్టాండ్‌లు రైల్వే స్టేషన్‌లు, బహిరంగ ప్రదేశాలు, సినిమా థియేటర్లు, కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యుత్‌ ప్రమాదాలు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు.

అబ్జర్వేషన్‌ హోం సందర్శన

వరంగల్‌: వరంగల్‌ ఆటోనగర్‌లోని అబ్జర్వేషన్‌ హోం(బాయ్స్‌)ను వరంగల్‌ జువైనల్‌ హోం బోర్డు సభ్యులు జడ్జి, మేరుగు సుభాష్‌ శుక్రవారం సందర్శించారు. అబ్జర్వేషన్‌ హోం ఇన్‌చార్జ్‌ సూపరింటెండెంట్‌ రమణమూర్తి, ఇతర ఉద్యోగులకు ఆ శాఖ డీడీ ఎంఆర్‌ బేగ్‌ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం అబ్జర్వేషన్‌ హోంను జువైనల్‌బోర్డు జడ్జీతో కలిసి సందర్శించి వివరాలు సేకరించినట్లు సుభాష్‌ తెలిపారు. ఈనెల 2న డీడీ వచ్చిన సమయంలో జరిగిన విషయంపై నోటీసు రాగా నివేదికను పంపించినట్లు సూపరింటెండెంట్‌ తెలిపినట్లు చెప్పారు. నివేదిక ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూస్తున్నట్లు సుభాష్‌ పేర్కొన్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్‌ సీపీ


లొంగిపోయిన మావోయిస్టులకు డీడీలను అందజేస్తున్న సీపీ

వరంగల్‌ క్రైం: మావోయిస్టుల పార్టీ సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి, తెలంగాణ ప్రభుత్వం కల్పించిన పునరవాస పథకం గురించి తెలుసుకొని మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న దంపతులు లొంగిపోయినట్లు కరీంనగర్‌ పోలీస్‌ కమిషనర్‌, వరంగల్‌ ఇన్‌చార్జ్‌ సీపీ అభిషేక్‌ మొహంతి తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌ పోలీస్‌ కమిషనరేట్‌లో వారు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు సెంట్రల్‌ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జ్‌ పుల్లూరి ప్రసాద్‌ రావు అలియాస్‌ చంద్రన్న వద్ద పనిచేస్తున్నారని వెల్లడించారు. తిక్క సుస్మిత సెంట్రల్‌ కమిటీ స్టాఫ్‌గా, మడకం దూల ప్రొటక్షన్‌ టీం మెంబర్‌గా పనిచేశారని తెలిపారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత ఇంటర్మీడియట్‌ వరకు చదువుకుందని, తన తండ్రి తిక్క సుధాకర్‌ మావోయిస్టు సానుభూతిపరుడిగా పనిచేయడంతో అతన్ని చూసి ఆకర్షితురాలై 2016 సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని బీజాపూర్‌ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీప్రాంతంలో బడే చొక్కారావు అలియాస్‌ దామోదర్‌ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రం సుకుమా జిల్లా పరియా గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడని, తన అన్న అయిన ఐయేత 2008 సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడని, అతన్ని చూసి ఆకర్షితుడైన దూల 2015 సంవత్సరంలో ఏరియా కమిటీ మెంబర్‌ అయిన జోగి ప్రోత్సాహంతో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరినట్లు సీపీ వెల్లడించారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి 30న వివాహం చేసుకొని వివిధ హోదాల్లో పలు చోట్ల పనిచేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఇద్దరిలో ఒక్కొక్కరిపై రూ.4లక్షలు నగదు రివార్డు ఉందని, దానిని డీడీ రూపంలో అందించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్‌, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌ సురేష్‌ పాల్గొన్నారు.

ప్రాణంతీసిన కర్రలోడు

గూడూరులో బోల్తాపడిన కర్రలోడ్‌ లారీ

- కర్రలు మీదపడడంతో ఇద్దరి దుర్మరణం
- మృతుల్లో ఒకరు ఉపాధ్యాయుడు, మరొకరు కానిస్టేబుల్‌
- గాయాలతో బయటపడిన చిరు వ్యాపారి సురేశ్‌


గూడూరులో జరిగిన ప్రమాదంలో కర్రలను తీస్తున్న ప్రజలు


పాపారావు, కానిస్టేబుల్‌ (ఫైల్‌)


దేవేందర్‌, టీచర్‌(ఫైల్‌)


ప్రమాదతీరును ఎస్పీకి వివరిస్తున్న ఎస్సై నగేష్‌

గూడూరు: మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌ మూలమలుపు వద్ద భారీ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడడంతో కర్రల కింద పడి ఇద్దరు మృత్యువాతపడ్డారు. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మట్టెవాడ శివారు కొంగరగిద్ద గ్రామానికి చెందిన దనసరి పాపారావు (35) గూడూరు పోలీసు స్టేషన్‌లో సీఐ గన్‌మెన్‌గా విధులు నిర్వరిస్తున్నాడు. మచ్చర్ల గ్రామానికి చెందిన చుంచ దేవేందర్‌ (34) ఉపాధ్యాయుడిగా ములుగు జిల్లాలో పనిచేస్తున్నాడు. ఉదయం 6.20 నిమిషాలకు కానిస్టేబుల్‌ పాపారావు మానుకోటకు, దేవేందర్‌ ములుగు వైపు వెళ్తేందుకు బస్సు ఎక్కడం కోసం ద్విచక్రవాహనంపై గూడూరు బస్టాండ్‌ సెంటర్‌ చేరుకున్నారు. ఒకేసారి అక్కడికి చేరుకున్న ఇద్దరు బంధువులు కావడంతో పలకరించుకుంటూ పక్కనే ఉన్న టీ స్టాల్‌ వద్ద నిలబడ్డారు. అదే సమయంలో అటువైపు జమాయిల్‌ కర్రల లోడ్‌తో అతివేగంగా వస్తున్న లారీ డ్రైవర్‌ బస్టాండ్‌ మూలమలుపు వద్దకు రాగానే సడెన్‌ బ్రేక్‌ వేశాడు. దీంతో బారీలోడ్‌తో ఉన్న లారీ రోడ్డుపక్కన పడిపోయింది. అదే సమయంలో మూలమలుపు టీ స్టాల్‌ వద్ద నిలబడిన పాపారావు, దేవేందర్‌పై జామాయిల్‌ కర్రలు మొత్తం పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న కూరగాయల చిరువ్యాపారి పాడిశెట్టి సురేశ్‌కు గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నగేష్‌ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో సహాయక చర్యలు ప్రారంభించాడు. గూడూరు, చెంద్రుగూడెం నుంచి జేసీబీలను రప్పించి పక్కకు నెట్టించారు. దీంతో దేవేందర్‌, పాపారావు మృతదేహాలు కన్పించాయి. ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ కొత్తగూడ, కేసముద్రం, గంగారం ఎస్సైలతో అక్కడికి చేరుకొని రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. మృతదేహాలను గూడూరులోని పోస్టుమార్టం గదికి తరలించారు. ఎమ్మెల్యే మురళీనాయక్‌, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ పోస్టుమార్టంలో ఉన్న మృతుల వివరాలను తెల్సుకొని సంతాపం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్‌ పాపారావుకు భార్య చైతన్య, కుమారుడు తన్విష్‌, కూతురు మోక్షిత ఉండగా, మచ్చర్లకు చెందిన చుంచ దేవేందర్‌కు భార్య భారతి, రియాన్‌, మన్విత ఉన్నారు.


గాయాలతో బయటపడిన చిరువ్యాపారి సురేశ్‌

విషాదంలో మచ్చర్ల, కొంగరగిద్ద


పాడె మోస్తున్న డీఎస్పీ, సీఐ

లారీ ప్రమాదంలో మృతిచెందిన పాపారావు, దేవేందర్‌ స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మట్టెవాడ శివారు కొంగరగిద్ద, మచ్చర్ల గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు పోస్టుమార్టం వద్ద మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం పాపారావు, దేవేందర్‌ మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాపారావు స్వగ్రామమైన మండలంలోని మట్టెవాడ శివారు కొంగరగిద్దలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ తిరుపతిరావు, తదితరులు పాపారావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, నివాళులర్పించారు. డీఎస్పీతోపాటు గూడూరు సీఐ బాబూరావు, ఎస్సై నగేష్‌, ఇతర పోలీసులు పాపారావు పాడెను మోశారు.

బయో డీగ్రేడబుల్‌ పాలిమర్లను వాడాలి


శిక్షణలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

కేయూ క్యాంపస్‌: ప్లాస్టిక్‌ స్థానంలో బయో డీగ్రేడబుల్‌ పాలిమర్లను వాడాలని హైదరాబాద్‌ నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫార్మస్యూటికల్‌ ఎడ్యూకేషన్‌ అండ్‌ రీసెర్చ్‌(నైపర్‌) మాజీ రిజిస్ట్రార్‌, కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం విశ్రాంత ఆచార్యులు సంజీవరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం సెమినార్‌హాల్‌లో శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్‌ అధ్యాపకులకు ఇండస్ట్రియల్‌ ట్రెనింగ్‌లో భాగంగా ఇంపార్టెన్స్‌ ఆఫ్‌ పాలిమర్స్‌ అనే అంశంపై నిర్వహించిన విస్తృతోపన్యాసంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యంగా పాలిమర్లను బయోడీగ్రేడబుల్‌ పాలిమర్లుగా మార్చడం, పరిశ్రమ, గృహ అవసరాల్లో ఉపయోగించే విధానాన్ని వివరించారు. పాలిమర్లతో తయారైన ఉత్పత్తులు మన చుట్టు ఉన్నాయన్నారు. వీటిలో సింథటిక్‌ ఫైబర్‌లు పాలిథిలిన్‌ కప్పులు, ఫైబర్‌ గ్లాస్‌, నైలాన్‌ బేరింగ్‌లు, ప్లాస్టిక్‌ బ్యాగులు, పాలిమర్‌ ఆధారిత పేయింట్‌లు జిగురు, ఫోమ్‌కుషన్‌, టైప్లాన్‌ కోటెడ్‌ వంట సామాగ్రి ఉన్నాయన్నారు. వీటి స్థానంలో బయోడీగ్రేడబుల్‌ దారాలు, పేపర్‌ కప్‌లు, జూట్‌ లేదా బట్టతో చేసిన సంచులు ప్రకృతికి సంబంధించిన రంగులు, ఇతర వంట పాత్రల వాడకం పెరగాలని తెలిపారు. కెమిస్ట్రీ విభాగం అధిపతి ఆచార్య సవితాజ్యోత్స్న అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడురోజులకు బాలిక మృతదేహం లభ్యం

- బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన కుటుంబం
- ఈ నెల 7న అదృశ్యమైన బాలిక


వసంత (ఫైల్‌)

మరిపెడ రూరల్‌: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌ వెళ్లిన దంపతుల కుమార్తె మియాపూర్‌లో ఈ నెల 7న అదృశ్యమైంది. అనంతరం అదే మియాపూర్‌ జంగల్‌లో 7రోజుల తర్వాత బాలిక మృతదేహం శుక్రవారం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం లక్ష్మాతండా గ్రామ పంచాయతీకి చెందిన బానోతు నరేశ్‌, శారద దంపతులు బతుకుదెరువు నిమిత్తం ఇద్దరి పిల్లలతో గత 20రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ మియాపూర్‌ ఏరియా పరిధిలోని నడిగడ్డతండాలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన వారి కుమార్తె బానోతు వసంత (12) సమీపంలోని కిరాణా షాపు వద్దకు వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బాలిక తండ్రి నరేశ్‌ చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా మియాపూర్‌ జంగల్‌లో కుళ్లిపోయిన స్థితిలో బాలిక మృతదేహం లభ్యమైంది. బాలిక అనుమానాస్పదంగా మృతి చెందినట్లు భావించిన పోలీసులు వసంత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు సదరు మృతదేహం తమ బిడ్డదేనని గుర్తించి బోరున విలపించారు.

నీవులేని జీవితం నాకొద్దు..

- భర్త మరణించాడని మనస్తాపంతో భార్య ఆత్మహత్య


సరిత(ఫైల్‌)

కొత్తగూడ: తోడునీడగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా జీర్ణించుకోలేని భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈవిషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కొత్తగూడ మండలంలోని రాతుగూడెం గ్రామానికి చెందిన మాలోతు రవితో సరిత(30)కి 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈనెల 5వ తేదీన సరిత భర్త రవి వరంగల్‌ జిల్లా సంగెం మండల కేంద్రంలో ద్విచక్రవాహన ప్రమాదంలో మృతి చెందాడు. వీరికి పిల్లలు లేరు. దీంతో ఒకరితో ఒకరు అన్యోన్యంగా ఉండేవారు. ఈక్రమంలో రవి లేని జీవితాన్ని జీర్ణించుకోలేని సరిత గురువారం రాత్రి గ్రామసమీపంలోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై దిలిప్‌ కేసు నమోదు చేసుకున్నారు.

ప్రతీ సోమవారం విద్యుత్‌ ప్రజావాణి

- టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి


కర్నాటి వరుణ్‌ రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు టీజీ ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం విద్యుత్‌ ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి ద్వారా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సకాలంలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని సర్కిల్‌లలోని డివిజన్‌, సబ్‌ డివిజన్‌, సెక్షన్‌ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సర్కిల్‌ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు వివరించారు. టీజీ ఎన్పీడీసీఎల్‌ పోర్టల్‌, కన్జూమర్‌ రిసెప్షన్‌ డెస్క్‌ను అనుసంధానిస్తూ విద్యుత్‌ ప్రజావాణి అనే మరో పోర్టల్‌ను వినియోగదారులకు అందుబాటులో తీసుకువస్తున్నామని వెల్లడించారు. వినియోగదారుల పరిష్కార వేదికగా ఈ ప్రజావాణి నిలుస్తుందని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి పదేళ్ల జైలు

జనగామ రూరల్‌: భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు జనగామ జిల్లా సెషన్స్‌ కోర్టు సీనియర్‌ సివిల్‌ జడ్జి విక్రమ్‌ గురువారం పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం జఫర్‌గూడెనికి చెందిన బత్తుల నర్సయ్యకు నర్మెట మండలం గండిరామారం గ్రామానికి చెందిన రజితతో వివాహం జరిగింది. భార్యపై అనుమానం పెంచుకున్న నర్సయ్య 2022లో రజితపై గొడ్డలితో హత్యాయత్నం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదాలు ముగిసిన తర్వాత గురువారం నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. బాధితురాలి తరఫు న్యాయవాది పీపీ స్టీవెన్స్‌, సహాయకురాలు శ్రీదేవి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

'భద్రకాళి'లో ఎమ్మెల్యేల పూజలు


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యేలు, తదితరులు

హన్మకొండ కల్చరల్‌: భద్రకాళి దేవాలయాన్ని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌, భూపాలపల్లి గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం సందర్శించారు. ఈమేరకు వారిని దేవాలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అమ్మవారిని ఎమ్మెల్యేలు దర్శించుకుని పూజలు చేసిన అనంతరం వారికి అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం చేశారు. అలాగే, రీజినల్‌ ఈపీఎఫ్‌ కమిషనర్‌ అర్జున్‌ టుక్రాల్‌ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి సూర్యప్రకాష్‌, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప చెరువులో మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్ప చెరువులో శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. స్థానిక మత్స్యకారులు చేపల వేట కోసం చెరువులోకి వెళ్తున్న క్రమంలో బోటింగ్‌ పాయింట్‌ వద్ద మృతదేహం తేలుతూ కనిపించింది. దీంతో వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై చల్లా రాజు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. చెరువు కట్టపై అనుమానాస్పదంగా ఉన్న బైక్‌ను గుర్తించి బండిపై ఉన్న టీఎస్‌–19 నంబర్‌ ఆధారంగా మంచిర్యాల పోలీసులకు మృతుడి ఫొటోలు, బైక్‌ ఫొటోలు పంపించారు. మంచిర్యాల పోలీసులు చెన్నూరుకు చెందిన చందన్‌గా గుర్తించి వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, 11రోజుల క్రితం అదృశ్యమైన చందన్‌ రామప్ప చెరువులో మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా మృతుడి మోహంపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.